క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ సెక్షన్‌లోని పలు గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు సూచనల మేరకు రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం, 132 కేవీ డబుల్ సర్క్యూట్‌లో ఉన్న పాడైన టవర్లు తొలగించి కొత్త టవర్లు ఏర్పాటు చేస్తున్న దష్ట్యా 33/11 కేవీ, 11 కేవీ లైను క్రాసింగ్ ఉండటం కారణంగా ద్రాక్షారామ సెక్షన్‌లోని 11 కేవీ తాళ్లపొలం ఫీడర్ మీద నెలపర్తిపాడు, గణపతి నగరం, మామిడిగుంట, జగన్నాయకులపాలెం, జగనన్న కాలనీలకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

కపిలేశ్వరపురం: అంగర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని నల్లూరు గ్రామంలో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 9.గంటల నుంచి సాయంత్రం 5.గంటలు వరకూ సరఫరాను నిలిపివేయనున్నామని, కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా వనువులమ్మ తీర్థం

కపిలేశ్వరపురం: కేదారిలంకలో ఆదివారం శ్రీ వనువులమ్మ జాతర ఉత్సవంలో భాగంగా ఆలయం వద్ద ఆదివారం తీర్థం నిర్వహించారు. గ్రామ ఆడపడుచులు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం అమ్మవారిని వైభవంగా గ్రామంలో ఊరేగించారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

రమాబాయికి ఘన నివాళి



రమాబాయికి నివాళి అర్పిస్తున్న పే బ్యాక్ టు ది సొసైటీ సభ్యులు

రామచంద్రపురం రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని ఉండూరులో పే బ్యాక్ టు ది సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. వక్తలు మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు చేదోడుగా నిలిచిన త్యాగమయి రమాబాయి అంటూ కొనియాడారు. అనంతరం సంస్థ స్థాపించి ఏడాది పూర్తయిన సందర్భంగా పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లలో ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మేకల సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు పెట్టా రామారావు, కార్యదర్శి గుడాల మంగరాజు, కోశాధికారి కాలకుర్చ రాహుల్, లీగల్ అడ్వైజర్ ఇంత సుకుమార్, సంయుక్త కార్యదర్శి గుడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



మండపేటలో లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): వివిధ అనారోగ్య సమస్యలతో సతమతమైన కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల క్యాంపు కార్యాలయంలో 17 మంది లబ్ధిదారులకు నాయకుల సమక్షంలో రూ.13,08,036 విలువైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో లబ్ధిదారుల గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి మార్జిన్



ప్రమాదభరితంగా ఉన్న రహదారి మార్జిన్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పెద్ద కాలువ వంతెన పట్టణ ముఖద్వారం వద్ద రహదారి మార్జిన్ కోతకు గురై ప్రమాదభరితంగా మారింది. జ్యోతీరావ్ పూలే విగ్రహం వద్ద మార్జిన్‌ను రహదారి మరమ్మతు పనులు చేపట్టినప్పుడు విస్మరించారు. కాలువలోకి ఉండటంతో వాహనదారులు మార్జిన్ వద్ద అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మార్జిన్‌ను సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులకు కూటమి వెన్నుపోటు

- అకాల వర్షాలకు అన్నదాత కుదేలు
- పలకరించే నాథుడు కరవు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.510 కోట్ల పంపిణీ

రామచంద్రపురం: రైతులను పూర్తిగా ఆదుకుంటామని సరిగ్గా ఏడాది క్రితం ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కూటమి ప్రభుత్వం రైతులను వెన్నుపోటు పొడిచింది. అకాల వర్షాలతో రైతులు పండించిన పంట వర్షపునీటి పాలయినా నియోజకవర్గంలో రైతులను పలకరించే నాథుడు లేడు. రాష్ట్రానికి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక మంత్రి నియోజకవర్గంలో రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పండించిన ధాన్యం కళ్లాలోనే తడిసి మొక్కలు మొలుస్తున్నా కూటమి ప్రభుత్వం చోద్యం చూసినట్లు చూస్తున్నారే తప్ప, రైతుల కష్టాలను ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమని రైతులు వాపోతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల పరిధిలో ప్రతీ ఏటా రెండో పంట రబీలో సుమారుగా 56 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తుంటారు. సరిగ్గా ఏప్రిల్, మే నెలల్లో వరి పంట మాసూళ్లు ముమ్మరంగా సాగుతుంటాయి. కానీ ఈ ఏడాది అనుకోకుండా మే మొదటి వారం నుంచే అకాల వర్షాలు ముంచెత్తాయి. దీంతో రైతులు ఉరుకులు పరుగులతో ధాన్యం మాసూళ్లు చేసేందుకు నానా అవస్థలు పడ్డాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మే నెలలో అధిక వర్షపాతం నమోదయింది. దీంతో చాలా చోట్ల ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. రామచంద్రపురం మండలంలోని తాళ్లపొలం, వెల్ల, కాపవరం, యనమదల కొత్తూరు వంటి ప్రాంతాల్లో ఎండబెట్టిన ధాన్యం రాశులు మొలకలు కూడా వచ్చాయి. ఏకబిగిన సుమారుగా వారం రోజుల పాటు వర్షాలు కురిసి ధాన్యం తడిసిపోయినా కూటమి నాయకుల్లో మాత్రం చలనం లేకుండా పోయింది. కనీసం అకాల వర్షాలతో దెబ్బతిన్న రైతుల కష్టాలను తెలుసుకుని పలకరించే కూటమి నాయకులు లేకపోవడం దారుణంగా చెబుతున్నారు. తడిసిన ధాన్యాన్ని అయినకాడికి అమ్ముకుని రైతులు నష్టాల పాలవుతున్నా, ప్రభుత్వం మాత్రం తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతుధర ఇచ్చి కొనుగోలు చేసే ఏర్పాటును స్థానిక నాయకులు చేయలేకపోయారు. దీంతో చేసేది లేక రైతులు వచ్చిన ధరకు అమ్ముకోవాల్సిన స్థితి ఏర్పడింది. దీనికి తోడు ప్రభుత్వ పరంగా అందించాల్సిన సహాయాన్ని కూడా అందించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవటం రైతులను వెన్నుపోటు పొడిచినట్లేనని విమర్శిస్తున్నారు.



ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కళ్లాల్లోనే తడిసిపోయిన ధాన్యం రాశులు



అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చిన ధాన్యం

గత ప్రభుత్వంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2019 మే నెల నుంచి 2024 మార్చి వరకు రైతులకు అందించే వివిధ పథకాల ద్వారా నియోజకవర్గంలోని రైతాంగానికి రూ.510 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాలకు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి జమ చేయడం జరిగింది. అప్పటి స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రిగా ఉన్న చెల్లుబోయిన శ్రీనివాస్ వేణుగోపాలకృష్ణ చొరవతో నియోజకవర్గంలో అకాల వర్షాలకు 2023లో పంట చేలు దెబ్బతినటంతో రాష్ట్రంలోనే అత్యధికంగా రూ.123 కోట్లు మంజూరు చేయించి రైతులకు పంపిణీ చేశారు. ఇది ఏపీలోని జిల్లాలోనే రామచంద్రపురం నియోజకవర్గానికి క్రాప్ ఇన్సూరెన్సును మంజూరు చేసిన ఘనత అప్పట్లో జరిగింది. వైఎస్సార్ సీపీ గత అయిదేళ్ల పాలనలో నియోజకవర్గంలో రైతులకు రైతు భరోసా ద్వారా రూ.149.89 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా రూ.32.77 కోట్లు, ఉచిత పంట బీమా ద్వారా రూ.9.47 కోట్లు, వైఎస్సార్ పంట బీమా ద్వారా రూ.283.11 కోట్లు మంజూరు చేసి రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటై ఏడాది ముగుస్తున్న రైతులకు ఒరిగిందేమీ లేదు. ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, వంటివి అటుంచి రైతులకు జరిగిన నష్టాన్ని కూడా అంచనా వేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కనీస మద్దతు ధర లేక రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం రైతుల కష్టాలను గట్టెక్కించాలని కోరుతున్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనేవారు లేరు



ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లోని ధాన్యం రాశులు తడిసిపోయి కొన్ని చోట్ల మొలకలు కూడా వచ్చాయి. వాటిని కొనుగోలు చేసే వారు లేకపోవటంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. పంటల బీమా ద్వారా రైతులను ఆదుకోవాలని కోరుతున్నాం.

– గుణ్ణం రామకృష్ణ, రైతు, కొత్తూరు

చలనం లేని కూటమి ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంగా రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఈ ప్రభుత్వం తుంగలో తొక్కి రైతులను నిలువునా మోసం చేసింది. రైతులు కష్టాల్లో ఉంటే కనీసం పలకరించే సమయం కూడా వారికి లేకపోవడం దారుణం.

– ఇంత సంతోషం, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు

కల్వర్టు నిర్మించాలి



కూళ్ల రహదారిలో కల్వర్టు లేక ప్రమాదకరంగా ఉన్న రహదారి

కె.గంగవరం: మండలంలోని కూళ్ల–పామర్రు ప్రధాన రహదారిపై ఉన్న పంట కాలువలకు కల్వర్టు నిర్మించకపోవడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ఈ రహదారిలో రెండు చోట్ల ప్రధాన రహదారికి కేవలం తూరలు వేసి ఇరువైపులా స్తంభాలు పాతారు. దీని వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి సమయంలో ఈ రహదారిలో వెళ్లడానికి వాహనచోదకులు భయపడుతున్నారు. ఈ దారిలో పంట కాలువలకు రెండు చోట్ల నూతన కల్వర్టులను నిర్మించి రక్షణ గోడలు ఏర్పాటు చేయాలని వాహదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ మండల సమావేశం

రాయవరం: మండలంలోని పసలపూడిలో సోమవారం వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి ఆదివారం విలేకరులకు ఓ ప్రకటనలో తెలిపారు. చింతా సుబ్బారాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ హాలులో ఉదయం 10.గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై కార్యకర్తలు, నాయకులనుద్దేశించి మాట్లాడనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని గంగాధరరెడ్డి పిలుపునిచ్చారు.

రాయవరం మహిళకు ఎక్స్‌లెన్స్ అవార్డు



చెన్నైలో బెస్ట్ ఎక్స్‌లెన్స్ మేకప్ అండ్ హెయిర్ స్టైలిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకుంటున్న సృజనరెడ్డి

రాయవరం: స్థానిక సృజన బ్యూటీ క్లినిక్ అధినేత సత్తి సృజనరెడ్డి బెస్ట్ బ్యూటీషియన్ అవార్డును చెన్నైలో అందుకున్నారు. ఈ విషయాన్ని సృజనరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 31న చెన్నైలో స్కైవస్ మాల్‌లో ప్రముఖ ఐకానిక్ సంస్థ 2025 సంవత్సరానికి సౌత్ ఇండియా ప్రతిష్టాత్మక బెస్ట్ ఎక్స్‌లెన్స్ ఇన్ మేకప్ అండ్ హెయిర్ స్టైలిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డును అందుకున్నట్లు ఆమె తెలిపారు. అవార్డు అందుకున్న ఆమెను మండపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తేతల వనజారెడ్డి, ప్రముఖ వైద్యులు చందన, ప్రత్యూషరెడ్డి, సాహిత్య తదితరులు అభినందించారు.

రేపు మండల సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): ఈ నెల 3న మండపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2. గంటలకు ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పకుండా హాజరవ్వాలని ఎంపీడీఓ కోరారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ

మామిడికుదురు: దోమల నిర్మూలతోనే మలేరియా నివారణ సాధ్యమవుతుందని సీహెచ్‌ఓ సత్యవతి తెలిపారు. మలేరియా నివారణా మాసోత్సవంలో భాగంగా ఆదివారం నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ×మలేరియా అంతం మనతోనే¢ అనే నినాదంతో ఈ ర్యాలీ నిర్వహించారు. దోమల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. తద్వారా మలేరియా నివారణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ ఏడుకొండలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలకు చట్టబద్ధత కల్పించాలి



గొల్లపాలెంలో 'వెన్నుపోటు దినం' విజయవంతంపై చర్చిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

కాజులూరు: ఎన్నికల్లో రాజకీయపార్టీలు ఇచ్చే హామీలు అధికారంలోకి వచ్చాక క్రమం తప్పకుండా అమలు చేసేలా ఎన్నికల కమిషన్ చట్టబద్ధత కల్పించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన కూటమి పాలకుల నిరంకుశ పాలనను నిరసిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకూ ఈ నెల నాలగున రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణులు 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనిపై చర్చించేందుకు ఆదివారం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పిల్లి కృష్ణమూర్తి అధ్యక్షతన గొల్లపాలెం మండల గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్ పేరుతో ఎన్నో తప్పుడు వాగ్దానాలు చేసిన కూటమి నేతలు ఏ ఒక్కటి పూర్తిగా అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా రామచంద్రపురంలో నాలుగో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ర్యాలీగా తరలివెళ్లి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేయనున్నామన్నారు. కార్యక్రమానికి మండల గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు.

జ్ఞాన సముపార్జనను గుర్తించాలి



తాపేశ్వరంలో జ్ఞాన సమాజ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): జ్ఞాన సముపార్జన ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సచ్చిదానంద దివ్య జ్ఞాన సమాజం నూతన భవనం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. జ్ఞాన సమాజం మండపేట మండలం తాపేశ్వరంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. ప్రారంభ సూచికంగా భవనం ఆవరణంలో ఎమ్మెల్యే ఉసిరి మొక్కను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజ ఉద్ధరణకై జ్ఞాన సమాజం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. గ్రామ సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి సంస్థ సేవలను కొనియాడారు. తెలుగు ఫెడరేషన్ అధ్యక్షులు కే.ఎస్ రామచంద్రరావు మాట్లాడుతూ దివ్య జ్ఞాన సమాజం కులాలు, మతాలకు అతీతమైన జీవన విధానాన్ని ప్రజల్లో ప్రచారం చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. అన్ని మత గ్రంథాల్లోని మంచిని స్వీకరించి థియోసోఫీ గ్రంథాలను రూపొందించడం అభినందనీయమన్నారు.

ఆ దారిలో ఎటు పోవాలి?



మండపేట రిజిస్ట్రార్ కార్యాలయం రహదారిలో అడ్డుగా నిలిపిన ద్విచక్ర వాహనాలు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని రిజిస్ట్రార్ కార్యాలయం దారి నిత్యం రద్దీగా ఉంటుంది. పట్టణ ప్రధాన రహదారి పక్కకు ఉన్న ఓ వీధిలో కార్యాలయం ఉంది. కార్యాలయానికి వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో రాకపోకలు సాగించేవారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సందర్శకులు కాలినడకన రాకపోకలు సాగించేందుకు మాత్రమే సరిపడా దారి ఉండటంతో కార్యాలయానికి వచ్చిన వారు తమ ద్విచక్రవాహనాలను అక్కడే నిలుపుతున్నారు. రహదారికి ఇరువైపులా వాహనాలను నిలుపుతుండటంతో కార్యాలయానికి కనీసం కాలినడకన వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి చివరన పట్టణ ప్రధాన రహదారిపై కొందరు వాహనాలను నిలుపుతుండటంతో సమీప షాపుల నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంబంధిత అధికారులు కార్యాలయానికి రాకపోకలు సాగించేవారి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు.

సన్‌డే



కె.పెదపూడిలో నిర్మానుష్యంగా రహదారి

అంబాజీపేట: రోహిణీ కార్తె ప్రతాపంతో వేసవి ఉష్ణోగ్రతలు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ప్రస్తుతం 40 డిగ్రీల నుంచి 41 డిగ్రీలు నమోదవుతూ తీవ్ర ఉక్కపోత, వేడిగాలులు వీస్తూ ఉండటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవతున్నారు. ఎండ తీవ్రత, తీవ్ర వడగాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయాన్నుంచే సూరీడు తన ఉగ్రరూపం దాల్చడంతో పొయ్యిలో కూర్చున్నట్లు ఉందని ప్రజలు వాపోతున్నారు. గత పది రోజులుగా వాయుగుండం కారణంగా మేఘావృతమై ఉండటంతో ఉక్కబోత మాత్రమే ఉండేది. కానీ ఆదివారం ఒక్కసారిగా భానుడు తన ప్రతాపాన్ని ఉగ్రరూపం చూపించాడు. దాంతో ఎండ తాకిడి, వేడిగాలులకు ప్రజలు బయటకు రావడానికే హడలిపోయారు. ఎండ వేడిమికి తాళలేక ప్రాణాలు పోతున్నాయంటూ వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతూ వచ్చింది. దీంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యమయ్యాయి. బస్సులు, లారీల డ్రైవర్లు నానా ఇబ్బందులు పడ్డారు. ముఖానికి జేబు రుమాళ్లు, తడిగుడ్డలు కట్టుకొని ఎండ తీవ్రత తగలకుండా ప్రయత్నాలు చేశారు. మధ్యాహ్నం 12 గంటలయ్యే సరికి పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. సెంటర్‌లోని దుకాణాలన్నీ మూసివేశారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగి 42 డిగ్రీలకు పైబడి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సైతం హెచ్చరిస్తోంది. నివాస గృహాలు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో నిత్యం ఏసీలు, కూలర్లు, పనిచేస్తూనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలకు వెళ్లేవారు, వ్యాపారులు, వ్యక్తిగత పనులపై ప్రయాణాలు చేసే వారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

కోనసీమలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి

కొత్తపేట: కోనసీమలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర కొబ్బరి దింపు, ఒలుపు కార్మిక సంక్షేమ సంఘం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది.

పొంచివున్న ప్రమాదం

- కోతకు గురవుతున్న ఏటిగట్టు
- తాత్కాలిక చర్యతోనే సరి
- శాశ్వత చర్యలు తీసుకోవాలంటున్న పరీవాహక ప్రజలు



ముందస్తు చర్యగా సుందరపల్లి ఏటిగట్టు వద ఇసుకబస్తాలను దింపుతున్న దృశ్యం (ఫైల్)

కె.గంగవరం: గౌతమీ గోదావరి కుడి ఏటిగట్టు మండలంలోని పలుచోట్ల బలహీనంగా మారింది. వర్షాకాలం వచ్చిందంటేనే గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలకు కంటి మీద కునుకు ఉండడం లేదు. గోదావరికి వరద వచ్చినప్పుడు మాత్రమే అధికారులు హుటాహుటిన ఇసుకమూటలు, కర్రలతో తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారని గోదావరి తీర ప్రాంత ప్రజలు విమర్శిస్తున్నారు. మండలంలోని సుందరపల్లి వద్ద ఏటిగట్టు మరింత బలహీనంగా ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కూళ్ల నుంచి మసకపల్లి వరకు సుమారు 21 కిలోమీటర్ల మేర ఏటి గట్టు ఉంది. అయితే సుందరపల్లి, దంగేరు, భట్లపాలిక, మసకపల్లి వద్ద ఏటిగట్టు బలహీనంగా ఉంది. దీనిలో సుందరపల్లి వద్ద రోడ్డు సగానికి కోతకు గురైంది. గత ఏడాది వచ్చిన వరదల్లో అధికారులు ఇక్కడ ఇసుక బస్తాలు వేసి పటిష్ట పరిచారు. అయితే అదే ఏడాది రెండో సారి వచ్చిన వరదకు అవి కూడా గోదావరిలో కొట్టుకుపోయాయి. తరువాత కొంతకాలంగా ఏటిగట్టు రోజురోజుకూ కోతకు గురవుతుంది. ప్రస్తుతం ఏటిగట్టు సగానికి కోతకు గురైంది. కోతకు గురవుతున్న ప్రాంతంలో కొద్దిపాటి కంకరను మాత్రమే అధికారులు ఏర్పాటు చేశారు. కాని పూర్తి స్థాయిలో ఏటిగట్టు పటిష్టతకు చర్యలు తీసుకోలేదు. ఈ వర్షాకాలంలో వరద ఉధృతి కాస్త పెరిగితే ఏటిగట్టు మరింత కోతకు గురవుతుందని స్థానికులు అంటున్నారు. ఏటా నిర్వహించే తాత్కాలిక చర్యలు మానేసి పూర్తి స్థాయిలో శాశ్వత చర్యలు చేపట్టే విధంగా అధికారులు స్పందించి వెంటనే ఏటిగట్టు పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఏటిగట్లకు మహర్దశ వచ్చింది. అప్పట్లో నిధులు మంజూరు చేసి జొన్నాడ నుంచి యానం వరకు ఏటిగట్టును వెడల్పు, ఎత్తు పెంచారు. గతంలో వరదలు వచ్చినప్పుడు అల్లాడిపోయే ప్రజలకు గట్టు ఎత్తు పెంచడంతో కొంత ఉపశమనం పొందారు. అయితే గట్టు ఎత్తు పెంచినా కొన్ని చోట్ల గోదావరి వరద నీరు కోతకు గురవ్వడంతో బలహీనంగా మారింది.